

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు అన్నారు.


8లో



సామర్థ్యానికి పరీక్ష

విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు విద్యాశాఖ ఎంపిక చేసిన పాఠశాలల్లో బుధవారం పరీక్ష (నాస్) నిర్వహిస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

డెల్టా కాలువలకు 6,600 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 400, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నిక రోజు స్పెషల్ సీఎల్

కాకినాడ సిటీ: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి గురువారం జరగనున్న ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకొని ఓటుహక్కు వినియోగించుకునేందుకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ కలెక్టర్ షణ్మోహన్ సగిలి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నియోజకవర్గ ఓటర్లుగా కాకినాడ జిల్లాలో నమోదైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు దీన్ని వినియోగించుకోవచ్చు. ప్రైవేట్‌సంస్థల్లో పని చేసే ఈ నియోజకవర్గ ఉపాధ్యాయ ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు సంబంధిత యాజమాన్యాలు వెసులుబాటు కల్పిస్తూ 5వ తేదీన పోలింగ్ సమయంలో విధులకు ఒక గంట ఆలస్యంగా హాజరయ్యేందుకు లేదా షిఫ్టుల అడ్జస్ట్‌మెంటు లేదా కొద్ది సమయం వెళ్లి వచ్చేందుకు అనుమతించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహించే భవనాల్లోని కార్యాలయాలు లేదా సంస్థలకు ఈ నెల 4, 5 తేదీల్లోనూ, ఈ ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించే భవనాల్లోని కార్యాలయం, సంస్థకు ఈ నెల 9వ తేదీన స్థానిక సెలవు దినాలు ప్రకటిస్తూ కలెక్టర్ షణ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.

5న టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపికను నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి కె.మోహన్‌బాబు మంగళవారం తెలిపారు. పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఎంపికలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. బాలుర విభాగంలో 15 మందిని, బాలికల విభాగంలో 15 మందిని, పురుషులు, మహిళల విభాగాల్లో క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 25 వరకు కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ స్కూల్‌లో జరిగే అంతర్‌జిల్లాల టేబుల్‌టెన్నిస్ పోటీలలో పాల్గొంటారని టేబుల్ టెన్నిస్ సంఘ అధ్యక్షుడు, విజయ్‌ప్రకాష్ పేర్కొన్నారు.

రా రైస్ ఎగుమతి చేయలేం

కలెక్టర్‌కు చాంబర్ వినతి

కాకినాడ: జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా చాంబర్ ప్రతినిధులు, ఎక్స్‌పోర్టర్స్, స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను వివరించారు. పోర్టులో ఇప్పుడున్న పరిస్థితుల్లో రారైస్ ఎగుమతి చేయడం అసాధ్యమని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పీడీఎస్ బియ్యం ఎగుమతి చేస్తే అంతటి అన్యాయం మరొకటి ఉండదని, అది రాష్ట్రానికి, దేశానికి మంచిది కాదని చాంబర్ అధ్యక్షుడు బాబు వివరించారు. పీడీఎస్ బియ్యం ఎగుమతి చేసే వారికి చాంబర్ ఎట్టి పరిస్థితుల్లోను మద్దతు ఇవ్వదనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. రా రైస్ ఎగుమతి చేయడంలో ఎదురవుతోన్న ఇబ్బందులతో వాటిని ఆపేయాలనే ఆలోచనతో త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ వేల్పూరి శ్రీనివాస్, లలితా రైస్ ప్రతినిధులు ఉన్నారు.

సన్నాలు కొనేవారేరి?

- చుక్కలు చూపిస్తోన్న దళారులు
- సాంబ మసూరి రైతుల గగ్గోలు
- కొనుగోలు పట్టించుకోని ప్రభుత్వం
- సీజన్‌లో 60 వేల ఎకరాల్లో సాగు
- బస్తా రూ.1,500కు కొనుగోలు
- నిల్వ చేసుకుంటే రూ.2,500 పై మాటే



కొత్తపల్లిలో పొలంలో బరకాలపై ఆరబెట్టిన సన్న రకం ధాన్యం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: బీపీటీ సన్న రకాలు పండించిన రైతులు గిట్టుబాటు లేక లబోదిబోమంటున్నారు. ప్రకృతి కన్నెర్ర చేసిన విపత్కర సమయంలో రైతులను సకాలంలో ఆదుకోవాల్సిన సర్కారు చేతులెత్తేసింది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 80శాతం ఆయకట్టు రైతులు స్వర్ణ మసూరి రకాన్ని సాగు చేశారు. మిగిలిన 20 శాతం ఆయకట్టులో బీపీటీ సాంబమసూరి సన్న రకాన్ని వేశారు. జిల్లాలో 2.14 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే ఇందులో 60వేల ఎకరాలు బీపీటీ సాంబ మసూరి రకాన్ని సాగు చేశారు. పెట్టుబడి కాస్త ఎక్కువైనా ధర ఆశాజనకంగా ఉంటుందని గంపెడాశతో బీపీటీ సాంబ మసూరి రకాన్ని వేసిన రైతులకు దళారులు, కమీషన్ ఏజెంట్లు చుక్కలు చూపిస్తున్నారు. అనుకోకుండా వచ్చిపడ్డ ఫెంగల్ తుపానుతో జిల్లాలో నాలుగైదు నియోజకవర్గాల్లో రైతులు అయోమయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. తుపానుతో గడచిన మూడు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలతో ధాన్యం తడిసి ముద్దయింది. ధర ఆశాజనకంగా ఉంటుందని సన్నాలు సాగు చేసిన రైతులైతే అసలు ఈ పంట ఎందుకు వేశాం దేవుడా అంటూ కంటతడి పెడుతున్నారు. సహజంగా సన్న రకమైన బీపీటీకి ఈ సీజన్‌లో మంచి గిరాకీ ఉంటుంది. అందుకు తగ్గట్టుగానే ధర కూడా ఆశాజనకంగా ఉంటుందని రైతులు గంపెడాశ పెట్టుకున్నారు. ఈ పంట సాగుచేసిన రైతులు వరి కోత కోసి స్వయంగా నూర్పిళ్లు చేసుకుని నెల, నెలన్నర నిల్వ చేసుకుని మంచి ధర వచ్చాక అమ్ముకుంటుంటారు.

పెట్టుబడి ఎక్కువైనా..

బీపీటీ సాగు కోసం ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35వేల పెట్టుబడి పెట్టారు. ఇతర రకాలతో పోలిస్తే ఈ రకానికి పెట్టుబడి పదివేలు ఎక్కువే అవుతుంది. స్వర్ణ రకంతో పోల్చుకుంటే బీపీటీ సాంబ మసూరి తక్కువ దిగుబడి వస్తుంది. అయినా నిల్వచేసుకుని అమ్ముకుంటే మంచి ధర వస్తుందని రైతులు ఈ రకం సాగు చేశారు. గతేడాది ఒక ఎకరం పొలంలో స్వర్ణ 40 బస్తాలు దిగుబడి రాగా, బీపీటీ సాంబ 25 నుంచి 30 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది.

అన్నదాతల ఆవేదన

కుప్పలు వేసి ఆరబెట్టి అమ్ముకుంటే అనుకున్న ధర రూ.2,500 వస్తుంది. వర్షానికి తడిసిపోవడంతో ఆరబెట్టి అమ్మే సరికి తూకం తగ్గిపోయి నష్టపోతామని రైతులు పచ్చి ధాన్యం కళ్లాల్లోనే అమ్మేస్తున్నారు. 75 కేజీల బస్తా రూ.1,400, రూ.1,500కి మించి కొనుగోలు చేయడం లేదని రైతులు మొత్తుకుంటున్నా సర్కారు చెవికెక్కడం లేదు. ధాన్యం నిల్వ చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని బీపీటీ సాంబ మసూరి సాగు చేసిన రైతులు దిగులు చెందుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణపై కనీసం దృష్టి పెట్టడం లేదంటున్నారు. రైతుల వద్ద నుంచి ఈ రకం ధాన్యాన్ని దళారుల ద్వారా కొనుగోలు చేసిన మిల్లర్లు బాయిల్డ్ చేసి మంచి ధరకు అమ్ముకుంటున్నారు. వాతావరణ పరిస్థితులకు తలొగ్గి తక్కువ ధరకే అమ్మేసుకోవాల్సి వస్తోందని రైతులు మదనపడుతున్నారు. నెల రోజులు ఆగితే సన్న రకాలకు మంచి డిమాండ్ ఉంటుందని తెలిసినా గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు రూ.1,400కే అమ్ముకుంటున్నారు. అంటే ప్రతి బస్తాపైనా రూ.800 బీపీటీ సాంబ మసూరి రైతులు కోల్పోతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం బీపీటీ స్టీమ్ బియ్యం 25 కేజీల బస్తా రూ.1,500కు అమ్ముడుపోతోంది. ఈ లెక్కన 75 కేజీలు రూ.4,500 పలుకుతుంది. బియ్యం ఇలా మంచి ధర పలుకుతుంటే తమ రెక్కల కష్టం బూడిదలో పోసిన పన్నీరవుతోందని రైతులు మదనపడుతున్నారు.

అయినా ధరలో మంచి జరుగుతుందని అనుకున్నారు. ఈసారి అవే అంచనాలతో బీపీటీ సాంబ మసూరి సాగుచేసిన రైతులు వరి కోతలకు సిద్ధమయ్యారు. గొల్లప్రోలు, పిఠాపురం, కరప, పెద్దాపురం, సామర్లకోట తదితర మండలాల్లో రైతులు ఈ రకం పంట కోతలు జరుపుతోన్న సమయంలో తుపాను దెబ్బతీసింది. మెషీన్‌లతో పంట ఒబ్బిడి చేసినా అప్పటికే ధాన్యం తడిసిపోయింది. దీనిని సాకుగా తీసుకుని దళారులు, కమీషన్ ఏజెంట్లు అమాంతం ధరలను తగ్గించేశారు. వాస్తవానికి ఈ రకాల ధాన్యానికి ధర రూ.2,300 నుంచి రూ.2,500 పలుకుతుందని రైతులు లెక్కలు వేసుకున్నారు. ఇంత లేకున్నా కనీసం రూ.2,200లు తక్కువ కాకుండా వస్తుందనే ఆశతో ధైర్యం చేసి సాగు చేసిన రైతులు ఇప్పుడున్న ధర చూసి గుండెలు బాదుకుంటున్నారు.

వర్షాలు దెబ్బ తీశాయి



ధర ఎక్కువగా ఉంటుందనే ఆశపడి బీపీటీ సాంబ మసూరి సాగు చేశాను. గత సీజన్‌లో ఇలానే వేసిన సాంబ మసూరికి మంచి ధర రావడంతో ఈ సారి కూడా అదే సాగు చేశాను. కానీ ఈసారి వర్షాలు దెబ్బ తీశాయి. పెట్టుబడి స్వర్ణ రకం కంటే కాస్త ఎక్కువైనా.. ధర వస్తుందని ఎదురు చూశాను. తీరా వర్షాలకు తడిసి పోవడంతో రూ.1,500కి మించి కొనే నాథుడే లేకుండా పోయాడు.

సుందరరెడ్డి రాజు, కౌలు రైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

ప్రత్తిపాడు కోఆర్డినేటర్ గిరిబాబు

- రెండు దశాబ్దాల తరువాత రాజకీయాల్లోకి ముద్రగడ కుటుంబం రీ ఎంట్రీ
- నమ్మకాన్ని నిలబెట్టుకుంటానంటున్న యువనేత



ముద్రగడ గిరిబాబు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తనయుడు ముద్రగడ గిరిబాబు ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం ఈ మేరకు మంగళవారం గిరిబాబుకు పార్టీ సమన్వయకర్తగా నియామక ఉత్తర్వులు జారీచేసింది. గిరిబాబు హైదరాబాద్, భీమవరంలలో ప్రాథమిక, ఉన్నత విద్య, చెన్నైలో ఇంజినీరింగ్ చదువుకుని ఉన్నత విద్య ఎంఎస్ లండన్‌లో పూర్తిచేశారు. అనంతరం ఢిల్లీలో సివిల్స్‌కు కోచింగ్ తీసుకుంటున్న సమయంలో సోదరుడు బాలుకు ఆరోగ్య సమస్య ఏర్పడడంతో స్వగ్రామం కిర్లంపూడి తిరిగొచ్చారు. అప్పటి నుంచి తండ్రి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంకు తోడుగా ఉంటున్నారు. తాత వీరరాఘవరావు, తదనంతరం తండ్రి ముద్రగడ పద్మనాభం నుంచి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న గిరిబాబు ఇటీవల ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి తాత వీరరాఘవరావు ఒక పర్యాయం, తండ్రి పద్మనాభం నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, రెండు పర్యాయాలు మంత్రి, 1999–2004 వరకు కాకినాడ ఎంపీగా పనిచేశారు. రెండు దశాబ్దాల తరువాత ప్రత్తిపాడు నియోజకవర్గ రాజకీయాల్లో ముద్రగడ కుటుంబం నుంచి మూడో తరం నేతగా గిరిబాబు రీ ఎంట్రీ ఇస్తున్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన దగ్గర నుంచి పద్మనాభంతో పాటు అతని వెంట తనయుడు గిరిబాబు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే గిరిబాబును ప్రత్తిపాడు కోఆర్డినేటర్‌గా జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకం ఉంచి అప్పగించిన కోఆర్డినేటర్ బాధ్యతలతో పార్టీ పూర్వవైభవానికి శక్తివంచన లేకుండా తండ్రి, పార్టీ నేతల సహకారాలతో కృషిచేస్తానన్నారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు వెళతానన్నారు.

సమన్వయంతో అభివృద్ధి

కాకినాడ సిటీ: కాకినాడను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు పారిశ్రామిక, ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు కోరారు. కాకినాడ పోర్టు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపార, పారిశ్రామికవేత్తలు, ట్రాన్స్‌పోర్టు, ఎక్స్‌పోర్ట్ ప్రతినిధులతో మంగళవారం రాత్రి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాకినాడ పోర్టు కేంద్రంగా చేసుకొని అనేక వ్యాపార కార్యక్రమాలు నిత్యం జరుగుతున్నాయన్నారు. ఈ కార్యకలాపాలతో వేలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతోందన్నారు.

కాకినాడ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు స్థానికంగా నెలకొల్పిన వివిధ పరిశ్రమలు, రవాణా రంగంలో ఉన్న వివిధ రకాల వాహనదారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పోలీస్, పరిశ్రమలు, రవాణా శాఖ అధికారులతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఆర్.సుస్మిత, కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, రవాణాశాఖ డీటీసీ మురళీకృష్ణ, పరిశ్రమశాఖ జీఎం సీహెచ్ గణపతి పాల్గొని పోర్టు పరిధిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపార, పారిశ్రామికవేత్తలు, ట్రాన్స్‌పోర్టు ప్రతినిధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాకినాడ సీ పోర్టు సీఈవో మురళీధర్, జెమిని ఎడిబుల్ ఆయిల్, ఇతర పరిశ్రమ సంస్థల ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్టు, లారీ ఓనర్స్, టాంకర్స్, మినీ గూడ్స్ వ్యాన్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు బడిలో భాగమే



దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న డీఈఓ రమేష్, చామంతి నాగేశ్వరరావు తదితరులు

కాకినాడ రూరల్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కూడా బడిలో భాగమేనని వారిని బడుల్లో చేర్చుకుని సహిత విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని వలసపాకల మండల పరిషత్ మెయిన్ స్కూల్ వద్ద గల భవిత సెంటరులో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఈఓ రమేష్, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. భవిత సెంటరును పరిశీలించి పలు సూచనలు చేశారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులను, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందిస్తుందన్నారు. భవిత సెంటరులో ప్రత్యేకమైన శిక్షణను అందిస్తుండడంతో పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలను నిర్వహించారు. డీఈఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఇన్నర్ వీల్స్ ఆఫ్ కాకినాడ క్లబ్ సభ్యులు లక్ష్మి, దుర్గ, నివేదిత, వరలక్ష్మి, మల్లేశ్వరి భవిత సెంటరుకు హెచ్‌పీ కలర్ ప్రింటర్‌ను బహూకరించారు. ఎంఈఓ 2 ఏసుదాసు, వాకలపూడి కాంప్లెక్స్ హెచ్ఎం మూర్తి, వలసపాకల స్కూల్ హెచ్ఎం నాగవేణి, భవిత సెంటర్ ఇన్‌స్ట్రక్టర్లు నాగలక్ష్మి, వీరగణేష్, పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఎమ్మెల్సీ ఎన్నికలు

కలెక్టర్ ఆదేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నిక ప్రక్రియ గురువారం స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆర్వో, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఏఆర్వో, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావుతో కలిసి కాకినాడ, పెద్దాపురం, ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానం, వెబ్ కాస్టింగ్, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌కి తరలించడం, రిసెప్షన్ సెంటర్లు సెక్టార్, రూట్ అధికారులు, పోలీస్ బందోబస్తు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు వంటి ఏర్పాట్లపై చర్చించారు. ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. కాకినాడ జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులను కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలన్నారు. కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణా నివారించాలి

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాలతో కలిసి పౌర సరఫరాలు, పోలీస్ అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బియ్యాన్ని ఎలా తనిఖీ చేయాలి, శాంపిల్ ఎలా తీయాలి, దానిని ఎలా పరీక్షించాలి, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని పీడీఎస్ బియ్యంగా మార్చడంలో ఉన్న దశలను, రైస్ మిల్లుల నుంచి బియ్యం ఎన్ని రకాలుగా మార్కెట్‌లోకి వస్తున్నాయో పరిశీలించాలన్నారు. వర్క్‌షాపులో పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం దేవుల నాయక్, ఇన్‌చార్జి డీఎస్‌వో టి.లక్ష్మీప్రసన్నదేవి, కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, ఇతర పోలీస్ అధికారులు, పౌరసరఫరాలశాఖ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం ఎగుమతి మూలాల ధ్రువీకరణలో మా పాత్ర లేదు

కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విదేశాలకు ఎగుమతి చేసే బియ్యం మూలాలను ధ్రువీకరించడంలో తమ శాఖ పాత్ర లేదని కస్టమ్స్ కమిషనర్ (విజయవాడ) సాధు నరసింహారెడ్డి తెలిపారు. కస్టమ్స్ నోటిఫైడ్ ఏరియాలోకి బియ్యం ప్రవేశించిన తర్వాత కస్టమ్స్ పాత్ర ప్రారంభమవుతుందన్నారు. కమిషనర్ నరసింహారెడ్డి మంగళవారం కాకినాడ కస్టమ్స్ హౌస్‌ను సందర్శించారు. అనంతరం అధికారులు, వ్యాపారులతో వివిధ సమస్యలపై చర్చించారు. కొత్తగా అమల్లోకి వచ్చిన సీకార్గో మేనిఫెస్టో, ట్రాన్స్‌షిప్‌మెంట్ రెగ్యులేషన్స్ (ఎస్‌సీఎంటీఆర్)–టెక్నికల్, సీబీఎల్ఎంఎస్ పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను వాణిజ్య ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై వ్యాపారవేత్తలకు త్వరలో శిక్షణ ఏర్పాటు చేస్తామని కమిషనర్ చెప్పారు. పీడీఎస్ బియ్యం ఎగుమతి సమస్యపై కూడా కమిషనర్ చర్చించారు. రైస్ ఎక్స్‌పోర్టర్స్ సంఘం అధ్యక్షుడు బీవీ కృష్ణారావు మాట్లాడుతూ.. తాము చట్టాన్ని గౌరవిస్తున్నామని, ఎగుమతి కోసం పీడీఎస్ బియ్యాన్ని మళ్లించే ఎటువంటి కార్యకలాపాలకు తమ సంఘం మద్దతు ఇవ్వదన్నారు. చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ బియ్యం ఎగుమతిపై స్పష్టత వచ్చే వరకు తెల్ల బియ్యం ఎగుమతి నిర్వహణను వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నామన్నారు.

పౌరసరఫరాల ఎన్ఓసీ తీసుకోవాలి

కాకినాడ కస్టమ్స్ అదనపు కమిషనర్ జి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ కాకినాడ కలెక్టర్ జూలై 31 ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పోర్టు ఏరియాలో ఆగస్టు 5 నుంచి పోలీసు, పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారుల ద్వారా పనిచేసేలా సమీకృత చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. పోర్టులోకి వచ్చే వాహనాలను తనిఖీ చేయించుకుని ఎగుమతిదారులు పౌర సరఫరాల ఎన్ఓసీ తీసుకోవాలన్నారు. పౌర సరఫరాల శాఖ చేస్తున్న ప్రయత్నాలకు సహకరించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. పీడీఎస్ బియ్యం మళ్లింపు సహా ఏదైనా ముప్పును అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు కస్టమ్స్ విభాగం కట్టుబడి ఉందన్నారు. విశాఖపట్నంలో రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్స్, వ్యాపారవేత్తలతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్లు ఎస్.రవికుమార్, జీఎస్ఆర్ నాయుడు, కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ బి.మహేష్‌బాబు, కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ వీవీ రాఘవులు, కాకినాడ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

పెట్టుబడి పిడుగు

- అన్నదాతలను దెబ్బతీసిన ఫెంగల్
- అదనపు ఖర్చులతో ఆవేదన
- ఉమ్మడి జిల్లాలో తుపాను బారిన 45 వేల ఎకరాలు
- యంత్రాల స్థానంలో కూలీల వినియోగం



అమలాపురంలో నేలకొరిగిన వరి చేలను కోస్తున్న రైతులు

సాక్షి, అమలాపురం: ఫెంగల్ తుపాను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రైతులకు కంటికి కనిపించే నష్టం కొంత చేస్తే, కనిపించని నష్టం అంతకు రెండు, మూడు రెట్లు చేసింది. తుపాను వల్ల వరిచేలు నేలకొరగడం, ఒరిగిన చేలు కొంత మేర నీట నానడం వల్ల ధాన్యం నాణ్యత దెబ్బతిననుంది. ఇదే సమయంలో యంత్రాలతో కోతలు నిలిచిపోవడం, ఆ స్థానంలో కూలీలతో కోతలు, నూర్పిడులు, తడిసిన ధాన్యం ఎండబెట్టడం వంటి పనులకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

చేదు ఫలితాలు

ఫెంగల్ తుపాను ప్రభావంతో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలు ఉమ్మడి తూర్పు రైతులకు చేదు ఫలితాలు చూపాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగ్గా, 1.05 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి కోతలు జరిగాయి. ఇంకా 58 వేల ఎకరాల్లో కోతలు జరగాలి. కాకినాడ జిల్లాలో 2.14 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, 1.20 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఇంకా 94 వేల ఎకరాల్లో మిగిలాయి. తూర్పు గోదావరి జిల్లాలో 1,78,447 లక్షల ఎకరాలలో సాగు జరగగా, 1,22,470 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఇంకా 55,976 ఎకరాల్లో కోతలు జరగాల్సి ఉంది. ఈ సమయంలో ఫెంగల్ తుపాను ఉమ్మడి తూర్పు రైతులను చావు దెబ్బతీసింది.

నీటిలోనే వరికంకులు

భారీ వర్షాల వల్ల మూడు జిల్లాలో సుమారు 41 వేల ఎకరాల్లో 20 శాతం నుంచి 30 శాతం వరకు వరిచేలు నేలకు ఒరిగి నీట నానుతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో మినహా డెల్టా శివారుల్లో నీరు దిగే పరిస్థితి లేక వరి కంకులు నీటిలోనే ఉన్నాయి. డెల్టాలో మురుగునీటి కాలు వ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో ముంపునీరు దిగే పరిస్థితి లేదు. కాలువల్లో పూడిక తీత, గుర్రపుడెక్క తొలగింపునకు ఇచ్చిన నిధులతో పనులు చేపట్టిన దాఖలాలు లేవు. దీనివల్ల నీరు దిగక ధాన్యం దెబ్బతిని రంగు మారిపోతోందని రైతులు వాపోతున్నారు.

ఒబ్బిడి చేయడం అదనపు భారం

నెలకొరిగిన చేలల్లో పంటను ఒబ్బిడి చేయడం రైతులకు అదనపు భారం కానుంది. వాతావరణం అనుకూలంగా ఉన్న సమయంలో యంత్రంతో కోతకు, కూలీలతో ధాన్యం ఎండ బెట్టేందుకు కలిపి ఎకరాకు రూ.ఏడు వేల వరకు అయ్యేది. వర్షాలకు చేలు నేలనంటిన చోట మెషీన్‌తో కోతకు రెండు నుంచి రెండున్నర గంటల సమయం పడుతోంది. అదనంగా మరో ముగ్గురు, నలుగురు కూలీలతో కలిపి రూ.పది వేల వరకు అవుతోంది. మనుషులతో కోతకు పదిహేను మంది వరకు మహిళా కూలీలకు, తడిసిన పనలను గట్టు మీదకు తెచ్చేందుకు, పడుగులు వేయడం, ఆరిన తరువాత ట్రాక్టర్‌తో నూర్పిడులకు, చిన్న ఫ్యాను ట్రాక్టరుతో ధాన్యం ఎగరబోత, ధాన్యం పట్టుబడికి కలిపి ఎకరాకు సుమారు రూ.14,400 వరకు అవుతోందని రైతులు లెక్క కడుతున్నారు. ఇప్పటి వరకు యంత్రాలతో కోతలు, ధాన్యం పట్టుబడులకు రెండు, మూడు రోజులు సరిపోతే, ఇదే పనికి ఇప్పుడు ఐదా రు రోజుల సమయం పడుతోందని చెబుతున్నారు.




ఉప్పలగుప్తంలో తడిసిన పనలు తెస్తున్న కూలీలు

దళారుల హవా

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ధాన్యం కొనుగోలు దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. బస్తా (75 కేజీలు) ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.1,725 కాగా, దీని కన్నా రూ.100 నుంచి రూ.150 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రంగుమారి, మొలక వచ్చిన ధాన్యాన్ని కొంటారనే నమ్మకం రైతులకు కలగడం లేదు. ఈ ఏడాది డెల్టా శివారు ప్రాంతాల్లో దిగుబడి సగటు 29 బస్తాలు (21.75 క్వింటాళ్లు) కన్నా తక్కువగా వస్తోందని రైతులు వాపోతున్నారు.

కోతల ఖర్చు ఎక్కువైంది



తుపాను వర్షాల వల్ల వరి చేలల్లో నీరు చేరి కోతలు ఆగిపోయాయి. తుపాను ముందు యంత్రాల సహాయంతో వరి కోతలు సాఫీగా సాగాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చేలల్లో నీరు ఉండడం వల్ల యంత్రాలు నడవటానికి ఇబ్బందిగా ఉంది. పోనీ కూలీలతో వరి మాసూళ్లు చేద్దామంటే రైతులు అదనపు ఖర్చులు భరించవలసి వస్తోంది. ఖరీఫ్‌లో ఏటా రైతులు నష్టపోతూనే ఉన్నారు. వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో ఖరీఫ్ పంట చేతికందని పరిస్థితి నెలకొంది.

– బొక్కా శ్రీనివాస్, రైతు, అల్లవరం

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల సీజ్



అల్లవరం పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

అల్లవరం: సముద్ర తీర ప్రాంతం నుంచి కొమర గిరిపట్నం గ్రామానికి అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం రాత్రి కొందరు గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తీరంలోని సముద్రం ఇసుకను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేసి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. దీనిపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్తులే చొరవ తీసుకుని ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల ఘటనా స్థలానికి చేరుకుని వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకొన్నారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

11న వాహనాలకు వేలం

అమలాపురం రూరల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖలో జీవిత కాల పరిమితి దాటి నిరుపయోగంగా ఉన్న వివిధ రకాల 17 వాహనాలను తుక్కు కింద విక్రయించేందుకు ఈ నెల 11న వేలం పాటను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర మంగళవారం తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా మొత్తం వాహనాలను ఆ రోజు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆన్‌లైన్‌లో http://konugolu.Ap.gov.in ద్వారా వేలం జరుగుతుందన్నారు. వాహనం ఒక్కంటికి రూ. 5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

4 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం కాటవరం లంకల్లో విస్తృతంగా దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా 4 వేల లీటర్ల బెల్లపు ఊట, 100 కేజీల బెల్లం, 25 కేజీల అమ్మోనియం ధ్వంసం చేసింది. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, హెడ్ కానిస్టేబుళ్ల ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

కాకినాడ రూరల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై సర్పవరం పోలీసులు 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ నిర్వహించారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి, రెండో జేఎస్‌సీఎం కోర్టులో హాజరు పర్చారు. వారిలో ముగ్గురికి జైలు, ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్టు సీఐ పెద్దిరాజు మంగళవారం తెలియజేశారు.

మరో 16 మందికి..

ప్రత్తిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి ప్రత్తిపాడు, తుని న్యాయమూర్తులు మంగళవారం జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. సీఐ బి.సూర్య అప్పారావు కథనం మేరకు ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మందికిరూ. 10 వేల వంతున, రౌతులపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన నిందితునికి రూ.10 వేలు జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగిని ఆరుగురికి రూ.500 చొప్పున జరిమానా విధించారు.

సామర్థ్యానికి పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో నేడు నాస్ సర్వే
- పరీక్ష రాయనున్న విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ



రాయవరం: నేటి బాలలే రేపటి పౌరులు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి పునాదులు కూడా వీరే. దేశం ప్రగతి పథంలో పురోగమించాలంటే పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం బాగుండాలి. తరగతుల వారీగా వారిలో ప్రతిభా నైపుణ్యం పెరుగుతున్నప్పుడే అన్ని విధాలా మంచి జరుగుతుంది. అందుకే దేశ భవిష్యత్తును పాఠశాల విద్య నిర్ణయిస్తుంది అంటారు. ఈ మేరకు పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తెలుసుకునేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) నడుం బిగించింది. ఈ మేరకు జాతీయ సామర్థ్య నిర్ధారణ పరిశీలన (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) (నాస్) చేయాలని నిర్ణయించింది. దానిలో భాగంగా బుధవారం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ సర్వే (పరీక్ష) చేసేందుకు ఆయా జిల్లాల వారీగా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

కోనసీమ జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 104 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) పేరుతో ఈ సర్వే చేపడుతున్నారు. 3, 9 తరగతులకు సంబంధించి 37 పాఠశాలలు, 6వ తరగతికి సంబంధించి 30 పాఠశాలల్లో సర్వే చేపట్టనున్నారు. మూడో తరగతికి సంబంధించి 710 మంది, ఆరో తరగతి నుంచి 815 మంది, తొమ్మిదో తరగతి నుంచి 1,019 మంది విద్యార్థులు నాస్ పరీక్షకు హాజరు కానున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన 148 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

తూర్పుగోదావరిలో..

తూర్పుగోదావరి జిల్లాలో మూడో తరగతికి సంబంధించి 44, ఆరో తరగతికి 38, తొమ్మిదో తరగతికి 43 స్కూళ్లను ఎంపిక చేశారు. మూడు నుంచి 978 మంది, ఆరు నుంచి 1037 మంది, తొమ్మిది నుంచి 1239 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ జిల్లాలో మొత్తం 125 పాఠశాలలకు చెందిన 3,254 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు.

కాకినాడ జిల్లాలో..

కాకినాడ జిల్లాలో మూడో తరగతికి సంబంధించి 39, ఆరో తరగతికి 40, తొమ్మిదో తరగతికి 43 పాఠశాలలను ఎంపిక చేశారు. మూడు నుంచి 958 మంది, ఆరు నుంచి 1187 మంది, తొమ్మిది నుంచి 1325 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు..

దేశంలోని అన్ని రాష్ట్రాలు ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఉచిత విద్యను అందిస్తున్నాయి. పలు కారణాలతో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్య నామమాత్రంగా ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా దేశానికి ప్రతిభావంతుల కొరత ఏర్పడుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు విద్యారంగ సంస్కరణలకు ఎన్‌హెచ్‌ఆర్‌డీ ప్రణాళికను రూపొందించనుంది. 2012లో నాస్ సర్వే నిర్వహించగా, తిరిగి మూడేళ్లకు ఇప్పుడు నిర్వహిస్తున్నారు. అప్పటి సర్వేలో 3,5,8 తరగతులతో పాటుగా, 10వ తరగతి విద్యార్థులను సర్వేకు తీసుకున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో దేశ వ్యాప్తంగా ఐదు మిలియన్ విద్యార్థులను సర్వే చేయాలని నిర్ణయించింది. ఈ ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయులకు శిక్షణ, తరగతుల వారీగా సిలబస్‌లో మార్పులు చేపడతారు. పాఠశాల నిర్వహణ సామర్థ్యం పెంపునకు చర్యలు తీసుకుంటారు. జాతీయ స్థాయిలో ఎన్‌సీఈఆర్‌టీ, రాష్ట్రస్థాయిలో ఎస్‌సీఈఆర్‌టీ ఈ సర్వేను పర్యవేక్షిస్తాయి.

సర్వే జరిగే తీరు

విద్యార్థుల అవగాహన సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు నిర్వహిస్తున్న ఈ సర్వేలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష నిర్వహించాల్సిన పాఠశాలలను 'యూడైస్' ఆధారంగా ఢిల్లీలోని ఎన్‌సీఈఆర్‌టీ ఎంపిక చేసింది. జిల్లాలోని 104 పాఠశాలల్లోని 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థులు సామర్థ్య పరీక్షలు రాయనున్నారు. ప్రతి తరగతిలో ఐదుగురికి పైబడి విద్యార్థులు ఉన్న పాఠశాలలనే ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను, ఎన్‌సీఈఆర్‌టీ మార్గదర్శకాల మేరకు ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించి అందజేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని మీడియం విద్యార్థులకు సామర్థ్య పరీక్ష నిర్వహిస్తారు. వీరు ఫలితాలను మాత్రం బహిర్గతం చేయరు. విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి చేస్తున్న ఈ సర్వే ఒక రకంగా గురువులకు ఓ పరీక్ష వంటిదని చెప్పవచ్చు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ



సర్వే నిర్వహించనున్న పాఠశాలలతో పాటు అన్ని స్కూళ్లలోనూ విద్యార్థుల్లో లెర్నింగ్ అవుట్ కమ్స్ (అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు) సాధించేందుకు కృషి చేస్తున్నాం. వెనుకబడిన పాఠశాలలు, వెనుకబడిన విద్యార్థుల (స్లో లెర్నర్లు)ను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. మోడల్ ప్రశ్నపత్రాలతో విద్యార్థులను పరీక్షకు సంసిద్ధులయ్యేలా చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, కోనసీమ

పూర్తయిన ఏర్పాట్లు



నాస్ సర్వే పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. డీసీఈబీ, సీబీఎస్ఈ పర్యవేక్షణాధికారులు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఈ పరీక్షను పర్యవేక్షిస్తారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా పరీక్షకు ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు తెలుసుకునేందుకు మాత్రమే ఈ పరీక్ష నిర్వహిస్తున్నాం.

– బి.హనుమంతరావు, సెక్రటరీ, డీసీఈబీ, అమలాపురం

ప్రేమ జంట ఆత్మహత్యతో విషాదం



అమలాపురంలోని శ్రీరామపురంలో దుర్గారావు ఇంటి వద్ద విషాదంలో బంధువులు

అమలాపురం టౌన్: విశాఖపట్నం గాజువాక సమీపంలోని షీలానగర్‌లో జరిగిన ప్రేమ జంట ఆత్మహత్య ఘటనతో వారి స్వస్థలమైన అమలాపురంలో విషాదం నెలకొంది. ఆ ప్రేమికులలో పిల్లి దుర్గారావు పట్టణంలోని శ్రీరామపురం, నూకల సాయి సుస్మిత విద్యుత్ నగర్‌కు చెందినవారు. సాయి సుస్మిత హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, దుర్గారావు విశాఖపట్నంలో క్యాటరింగ్ నిర్వహిస్తున్నాడు. షీలా నగర్ వెంకటేశ్వర కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దుర్గారావు అద్దెకు ఉంటున్నాడు. వీరిద్దరూ మంగళవారం తెల్లవారుజామున దానిపై నుంచే కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద వార్త తెలియగానే అమలాపురం నుంచి దుర్గారావు, సాయి సుస్మిత కుటుంబీకులు, బంధువులు విశాఖపట్నానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ అపార్ట్‌మెంట్ కింద రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. దుర్గారావు ఒక్కడే ఆరు నెలలుగా అపార్ట్‌మెంటులో ఉంటున్నాడని తెలిసింది. అక్కడి స్థానికులు కూడా ప్రేమజంట ఆత్మహత్య చేసుకోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- రూ.మూడు లక్షలు, 48 గ్రాముల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ విద్యాసాగర్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో ఇటీవల జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను ఆలమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ మంగళవారం ఆలమూరు పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గత నెల నవంబరు 26న గ్రామానికి చెందిన విశ్వనాథుల వీరభద్రరావు నివాసంలో చోరీ జరిగింది. రూ. 3 లక్షలతో పాటు 48 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించిన సీఐ విద్యాసాగర్ ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. వీరభద్రరావు సమీప బంధువులే ఈ చోరీకి పాల్పడినట్టు అనుమానించి, కడియం మండలం రాజవోలుకు చెందిన తుమ్మా వినోద్ కుమార్, ఏలూరు పవన్ కుమార్‌ను నిందితులుగా గుర్తించారు. విచారణలో వారిద్దరూ తమ నేరాన్ని ఒప్పుకోవడంతో మంగళవారం అరెస్ట్ చేశారు. వారు దొంగిలించిన నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అతి తక్కువ కాలంలో కేసును ఛేదించిన సీఐ విద్యాసాగర్, ఎస్సై అశోక్, ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రాము, పోలీసు సిబ్బందిని ఎస్పీ బి కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు అభినందించారు.

గోదావరిలో యువకుడి మృతదేహం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని స్నాన ఘట్టం సమీపంలో మంగళవారం సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసున్న యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. సీఐ పి.విశ్వం మాట్లాడుతూ మృతికి చేతిపై అమ్మ అనే పచ్చబొట్టు ఉందన్నారు. అతడి ఆచూకీకి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని, మూడు, నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉబ్బిపోయిందన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసు స్టేషన్‌లో, 94407 96622 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



మృతుడు శివ (ఫైల్)

రాజానగరం: మండలంలోని నరేంద్రపురంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి తిరగబడటంతో డ్రైవర్ మృతి చెందాడు. ఆ గ్రామానికి చెందిన డ్రైవర్ వెలుగుల శివ (31) రబీ సాగుకు పొలాన్ని దమ్ము చేస్తున్నాడు. ఈ సమయంలో గట్టు ఎక్కడంతో ట్రాక్టర్ వెనక్కి తిరగబడింది. దాని కింది భాగంలో శివ ఇరుక్కుపోయి ఊపిరాడక మృతి చెందాడు. ఘటన జరిగిన వెంటనే పొక్లెయిన్‌తో ట్రాక్టర్‌ను పక్కకు తొలగించినా ప్రయోజనం లేకపోయింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

30 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



చొల్లంగిలో రేషన్ బియ్యం లారీని సీజ్ చేసిన అధికారులు

తాళ్లరేవు: చొల్లంగిలోని రైసుమిల్లుకు రేషన్ బియ్యంతో వచ్చిన లారీని సివిల్ సప్లయిస్ అధికారులు సీజ్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని లక్ష్మీగణపతి ఇండస్ట్రీస్ నుంచి చొల్లంగిలోని రైస్‌మిల్లుకు సోమవారం 30 టన్నుల బియ్యంతో లారీ వచ్చింది. అయితే ఆ బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు రైస్‌మిల్లు సిబ్బంది నిరాకరించారు. ఈ నేపథ్యంలో లారీ తిరిగి వెళ్లే క్రమంలో సివిల్ సప్లయిస్ డీటీలు అనిల్ కుమార్, శ్రీనివాసరావు దాడి చేసి పట్టుకున్నారు. లారీలోని బియ్యాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యమని గుర్తించారు. ఈ మేరకు 6 ఏ కేసు నమోదు చేసి, బియ్యం సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ బియ్యం విలువ సుమారు రూ.పది లక్షలు ఉంటుంది.

ఇంటి తాళం తెరచి దర్జాగా చోరీ

- చెత్త బకెట్ కింద కీ పెట్టిన యజమానురాలు
- రూ.లక్ష, బంగారు, వెండి వస్తువుల చోరీ



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రాజోలు: ఇంటి గుమ్మం ముందు చెత్త బకెట్ కింద ఉన్న లాక్‌తో ఇంటి తాళం తెరచి రూ.లక్ష నగదు, బంగారం, వెండి వస్తువులను దొంగ దోచుకుపోయాడు. ఎస్సై రాజేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాటిపాక గ్రామానికి చెందిన గుబ్బల తాతారావు తన ఇంటి సమీపంలో తూకం బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో భార్య అతడికి సాయం చేస్తుంటారు. రోజూ మాదిరిగానే ఈ నెల 2వ తేదీన భార్య వంట పని ముగించుకుని ఇంటికి వేసింది. ఆ కీని గుమ్మం పక్కనే ఉన్న చెత్త బకెట్ కింద పెట్టి భర్త షాపు వద్దకు వెళ్లింది. తాళం చెవి పెట్టే ప్రదేశం భార్యాభర్తలకు మాత్రమే తెలుసు. ఈ విషయాన్ని గమనించిన దొంగ ఆ తాళం చెవి తీసుకుని దర్జాగా ఇంటి తలుపు తెరిచాడు. లోపల రూ.లక్ష నగదులో పాటు రూ.4.70 లక్షల విలువైన బంగారం చెవిదిద్దులు, చెంప సవరాలు, మ్యాటీలు, పాపిడి బొట్టు, ఆరు ఉంగరాలు, ఆరు కాసుల హారం, అర కేజీ బరువైన వెండి పట్టీలు, గ్లాసులు, గిన్నెలు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైలెన్సర్ల తొలగింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): శబ్ద కాలుష్యం కలుగజేస్తున్న 201 మోటార్ సైకిళ్లను గుర్తించి, వాటి సైలెన్సర్లను తొలగించినట్టు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు వారం రోజులుగా నగరంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల కంటే ఎక్కువ శబ్ద కాలుష్యం కలగజేసే మోటార్ సైకిల్ సైలెన్సర్లను తొలగించామన్నారు. వాటి స్థానంలో కంపెనీ అధికృత సైలెన్సర్లను ఏర్పాటు చేయించి, వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్టు తెలిపారు. ఇలాంటి సైలెన్సర్లను అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు అన్ని దుకాణాలు, షోరూమ్‌లకు నోటీస్ జారీ జేశామన్నారు.

పోక్సో కేసులో స్కూల్ అసిస్టెంట్ మూర్తి అరెస్ట్

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో బాలికపై లైంగిక చర్యలకు పాల్పడిన స్కూల్ అసిస్టెంట్ (హిందీ) తంగేటి సత్యనారాయణమూర్తిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఉత్తర్వుల మేరకు సౌత్‌జోన్ డీఎస్పీ డి.భవ్య కిశోర్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ గణేష్, ఎస్సై హరిబాబు సమగ్ర దర్యాప్తు చేశారు. సత్యనారాయణమూర్తిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.

సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు

తంగేటి సత్యనారాయణమూర్తిని సస్పెండ్ చేస్తూ రంపచోడవరం ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) విజయశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. దేవీపట్నం మండలం కొత్తవీధిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మూర్తి పక్షవాతం, ఆరోగ్య సమస్యల నేపథ్యంలో ధవళేశ్వరంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు డిప్యుటేషన్‌పై వచ్చాడు. ఇటీవల విద్యార్థినులతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఉపాధ్యాయులను అసభ్య పదజాలంతో మాట్లాడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి, ఐసీడీఎస్ సీడీపీవో విచారణలో వాస్తవమని తేలడంతో టీఎస్ఎన్ మూర్తిని విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్రాష్ట్ర నేరగాడి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

అద్దంకి: అద్దంకి పట్టణం పోతురాజు గండిలోని శ్రీసాయిరామ్ ఏజెన్సీస్ దుకాణంలో జరిగిన భారీ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో చీరాల డీఎస్పీ మొయిన్ విలేకర్లకు కేసు వివరాలు వెల్లడించారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన సాయి సూర్యతేజ చిన్న వయసు నుంచే దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గ్యారేజీల షట్టర్లు పగులగొట్టి దొంగతనాలు చేస్తుండేవాడు. గుంటూరులోని స్వప్నభారత్ నగర్‌కు చెందిన బెల్లంకొండ విజయ్‌కృష్ణతో కలసి గత నెల 25వ తేదీ రాత్రి శ్రీరామ్ ఏజెన్సీ షట్టర్ పగులగొట్టి గల్లాయి పెట్టెలోని రూ.15.30 లక్షల నగదును చోరీ చేశాడు. ఆ విషయమై దుకాణ యజమాని గోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం అద్దంకి సమీపంలోని కొంగపాడు డొంక వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి అద్దంకి తో పాటు వివిధ జిల్లాలో 8 కేసులకు సంబంధించిన సొత్తును రికవరీ చేశారు. ఇతడిపై పలు జిల్లాల్లో 20 కేసులు నమోదు అయ్యాయి.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

- జవాబుదారీతనంతో పనిచేయాలి
- మున్సిపల్ ఆర్డీ నరసింహారావు



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు

రామచంద్రపురం: ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఆర్డీ సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, ఇంజినీరింగ్, శానిటరీ, ఇతర పురపాలక విభాగాల అధికారులు, సచివాలయాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ల దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను సామరస్యంగా స్వీకరించి, వాటికి పరిష్కార మార్గాలను సాధ్యమైనంత త్వరగా చూపించాలన్నారు. అప్పుడే అధికారులు, పురపాలక సంఘం పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. తడి, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా విక్రయించగలిగితేనే పురపాలక సంఘానికి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. అప్పుడే చెత్త తగ్గి కంపోస్ట్ యార్డు స్థలాలు సరిపోతాయని, లేకుంటే ఎంత స్థలం ఉన్నా చెత్త వేయడానికి సరిపోదన్నారు. మున్సిపాలిటీలో ఆదాయ వనరులు, పన్నుల వసూలు, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష చేశారు. సమావేశంలో రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, డీఈ శ్రీకాంత్, ఆర్డీ కార్యాలయ సూపరింటెండెంట్ జి.రాధాకృష్ణ, కె.వేణుగోపాలరావు, కొవ్వూరు, రామచంద్రపురం, నిడదవోలు, అమలాపురం, మండపేట, ముమ్మిడివరం పట్టణ కమిషనర్లు పాల్గొన్నారు.

డెర్మటాలజీలో జీఎస్ఎల్‌కు బహుమతులు



బహుమతులు తీసుకువచ్చిన వైద్యులను అభినందిస్తున్న గన్ని భాస్కరరావు తదితరులు

రాజానగరం: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్ వెనీరియాలజిస్ట్స్ అండ్ లెప్రలజిస్ట్స్ (ఐఏడీవీఎల్) ఏపీ బ్రాంచ్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన సదస్సులో స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలకు చెందిన డెర్మటాలజీ విభాగం నాలుగు బహుమతులను గెలుచుకుంది. తీవ్రతరమైన బొల్లి వ్యాధిగ్రస్తులకు మెటబాలిక్ సిండ్రోమ్‌ను ముందుగానే స్క్రీనింగ్ చేయాల్సిన ప్రాముఖ్యతపై డాక్టర్ గన్ని సాధిక, డాక్టర్ బత్తిన నవ్య సమర్పించిన సైంటిఫిక్ పేపర్‌కు మొదటి బహుమతి లభించింది. అలాగే సొరియాసిస్‌పై డాక్టర్ అనర్ఘ సమర్పించిన పరిశోధన పత్రానికి కూడా మొదటి బహుమతి వరించింది. మందులతో తగ్గని బొల్లి వ్యాధిని సున్నితమైన సర్జరీ ద్వారా మచ్చలు తగ్గించవచ్చని డాక్టర్ ధృతిచుగ్ ప్రెజెంట్ చేసిన థీసిస్‌కు కూడా బెస్ట్ అవార్డు దక్కింది. బహుమతులతో తిరిగి వచ్చిన వైద్యులను చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్ అభినందించారు.